**మంచిమాట**


నీకున్నదంతా ఏదో ఒకరోజున
ఇచ్చేయాల్సిందే. నీవెంట ఏదీ
తీసుకెళ్ళలేవు. అంచేత
ఆ ఇచ్చేదేదో ఇప్పుడే ఇవ్వు.
ఇచ్చే గొప్ప అవకాశాన్ని నువ్వే
వాడుకో. ఇవ్వడంలోని ఆనందాన్ని
అనుభవించాల్సింది నువ్వేకాని
నీ వారసులు కాదు.


# DD9 వార్త

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 194 | హైదరాబాద్, మార్చి, బుధవారం 04, 2026 | పేజీలు : 06 | వెల : 3.00


## స్పోర్ట్స్ డ్రామాలో శ్రీలీల?




# అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్‌కు కొత్త దిశ

నాణ్యతే విజయానికి కీలకమన్న ప్రధాని మోడీ
పారిశ్రామిక రంగ లక్ష్యాలపై కీలక సూచనలు
అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలని వెల్లడి
వాణిజ్య ఒప్పందాలకు దేశంలో కొత్త అవకాశాలు
భారత ఉత్పత్తులకు విదేశీ మార్కెట్‌లో ప్రాధాన్యం
ఆర్ అండ్ డీ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

భారత్ ప్రపంచ వాణిజ్య రంగంలో వేగంగా ముందుకు సాగుతోందని, ఈ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలంటే పరిశోధన మరియు అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ పెరుగుతున్న ఈ సమయంలో భారత పారిశ్రామిక రంగం నాణ్యతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోని అనేక దేశాలతో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశ పరిశ్రమలకు కొత్త అవకాశాల తలుపులు తెరిచాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందాల వల్ల భారత ఉత్పత్తులకు విదేశీ

..మిగతా 2లో



# అర్హులందరికీ సంక్షేమం చేరాలి

కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
99 రోజుల కార్యాచరణపై దిశానిర్దేశం
మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహణ
ప్రత్యేక యాప్‌తో పర్యవేక్షణ
ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి
ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం తప్పనిసరి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు తప్పకుండా చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు.

**గ్రామసభల ద్వారా లబ్ధి వివరాలు**


రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల లబ్ధిని గ్రామసభల్లో ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వం చేసిన పనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

**ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం తప్పనిసరి**

99 రోజుల కార్యక్రమంలో వార్డు సభ్యులు, సర్పంచులు,

..మిగతా 2లో





# విద్యుత్ వినియోగంలో తెలంగాణ రికార్డు

18,139 మెగావాట్ల గరిష్ట డిమాండ్
సాఫీగా నిర్వహించిన విద్యుత్ సంస్థలు
వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి
రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని వెల్లడి
అధికారులు, సిబ్బందికి అభినందనలు
సమర్థవంతంగా పని చేశారని ప్రశంసలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రం విద్యుత్ వినియోగంలో మరో కీలక మైలురాయిని అందుకుంది. మంగళవారం ఉదయం 11:01 గంటలకు నమోదైన 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇది తెలంగాణ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక గరిష్ట డిమాండ్ అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, ఫీల్డ్ సిబ్బంది

..మిగతా 2లో

# రాష్ట్ర ఆర్థిక స్థితిపై వాస్తవాలు బయటపెట్టండి..

సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ
రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆందోళన
శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
కేంద్రం కేటాయించిన నిధులపై వివరణ
ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రశ్నలు
కాంగ్రెస్ నేతలపై అవినీతి ఆరోపణలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బడ్జెట్ సమావేశాల కంటే ముందే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని

..మిగతా 2లో



# హైడ్రాకు ఈ అక్రమ వెంచర్లు కనిపించడం లేదా..

నార్సింగిలో అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లు
ఉన్నాయంటూ కవిత ఆందోళన
ఈ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్
బీఆర్ఎస్ హయాంలో ఇక్కడి భవనాలకు
అనుమతులు ఇచ్చారని విమర్శలు
కాంగ్రెస్ లంచాలు తీసుకుని వాటికి
మళ్లీ అనుమతులు ఇచ్చిందన్న కవిత

03



# మధ్యప్రాచ్య ఉద్రిక్తతలపై కాంగ్రెస్ ఆందోళన

కేంద్రం వైఖరి
ప్రకటించాలని రాహుల్ డిమాండ్
భారతీయుల భవిష్యత్‌పై
అనిశ్చితి నెలకొందని వ్యాఖ్య
అంతర్జాతీయ చట్టాల
ప్రస్తావించిన రాహుల్
పార్లమెంట్‌లో చర్చించాలన్న
సోనియా గాంధీ

03



# రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

9 మంది పేర్లతో జాబితా విడుదల
ఇంకా ఏ నిర్ణయం తీసుకోని కాంగ్రెస్
నేడు ఢిల్లీకి తెలంగాణ కాంగ్రెస్ పెద్దలు
అధిష్టానంతో కీలక చర్చలు
నేడు అభ్యర్థుల
జాబితా ప్రకటించే అవకాశం




03

# యథేచ్ఛగా అక్రమ క్వారీలు

నిబంధనలకు తూట్లు
ప్రభుత్వ ఆదాయానికి గండి
మైనింగ్ దందా కనిపించడం లేదా?
దోచుకున్న సంపదను పెనాల్టీతో రికవరీ చేయాలి
మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్



03

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయండి..

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి సూచనలు
అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ
అర్హులందరికీ న్యాయం జరగాలన్న మంత్రి
మానవత్వంతో నిర్ణయాలు తీసుకోవాలని పిలుపు
క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమవ్వాలని సూచన

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో ప్రజాకేంద్ర పాలన అమలు కావాలంటే జిల్లా కలెక్టర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా పరిపాలన ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్,

..మిగతా 3లో



# రాష్ట్ర ఆర్థిక స్థితిపై వాస్తవాలు బయటపెట్టండి..

**మొదటిపేజీ తరువాయి**

విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని వెల్లడించిన కిషన్‌రెడ్డి.. రాష్ట్రంలో జీతాలు, రైతు భరోసా, సంక్షేమ పథకాల అమలు.. ఇలా ఏ పని చేయాలన్నా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని విమర్శలు గుప్పించారు. సాస్కి పథకం కింద తెలంగాణకు రూ.10,000 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను కేంద్రం అందించిందని కిషన్‌రెడ్డి వివరించారు. ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా, ఖజానా ఖాళీ అని నెపం నెట్టడంపై కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని లేఖలో ఆయన స్పష్టీకరించారు.

‘‘2023లో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టో ద్వారా 6 ప్రధాన గ్యారంటీలతో పాటుగా 420 హామీలను తెలంగాణ ప్రజలకు ఇచ్చింది. ఈ హామీలను నమ్మిన తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్‌కి అధికారాన్ని కట్టబెట్టింది. అనంతరం ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మీరు, ఇచ్చిన హామీలను అమలు చేయమంటే రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలకు బదులు ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలునుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.రాష్ట్ర ఖజానా గురించి ఇలా మాట్లాడిన మీరే, ఇటీవల ఒక సభలో మాట్లాడుతూ సోనియా గాంధీరాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ. 1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మీరు మాట్లాడిన తీరును చూస్తుంటే, రాష్ట్ర ఖజానా నిల్ కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్ అన్న విషయం అర్థమవుతోంది.

2014 లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అనేక రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తూ వస్తోంది. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, మరెన్నో మూలధన పెట్టుబడులు మొదలైనవాటి రూపంలో గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ. 12 లక్షల కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరియు ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. అందులో రూ.2.5 లక్షల కోట్ల పన్నుల వాటా నిధులు, రూ.1.85 లక్షల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, దాదాపు రూ.36,000 కోట్లకు పైగా రైల్వే బడ్జెట్ కేటాయింపులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే పనులు, దాదాపు రూ.40,000 కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.50,000 కోట్ల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు వివిధ ఆర్థిక సంఘాల సిఫారసుల ద్వారా అందిస్తున్న రూ.40,000 కోట్లకు పైగా నిధులు, రూ.12,000 కోట్లకు పైగా విలువైన విద్యుత్ ప్రాజెక్టులు, రూ.14,000 కోట్లకు పైగా పీఎం కిసాన్ నిధులు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లకు పైగా నిధులు, విద్య & క్రీడలకు రూ.21,000 కోట్లకు పైగా నిధులు, దాదాపు రూ.9,000 కోట్ల ఆరోగ్య సంరక్షణ నిధులు మొదలైనవి ఉన్నాయి.

అంతే కాకుండా, కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.2 లక్షల కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరించింది. మరో రూ.60,000 కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి పత్తిని సేకరించింది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను ఇవ్వడమే కాకుండా, వివిధ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల ద్వారా దాదాపు రూ. 10 లక్షల కోట్ల ఋణాలను కూడా తెలంగాణ రాష్ట్రానికి అందించింది. వీటికి అదనంగా రాష్ట్రాలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన మూలధన పెట్టుబడి నిధుల కోసం రాష్ట్రాలకు 50 సంవత్సరాల కాలపరిమితితో కూడిన వడ్డీ రహిత ఋణాలను అందించి ఆయా రాష్ట్రాల అభివృద్ధికి అదనపు సహకారాన్ని అందించాలనే ప్రధానమంత్రి మోదీ గారి సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం “స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్” పేరిట ఒక నూతన పథకాన్ని 202021 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించింది.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందించిన ఈ సౌలభ్యాన్ని సానుకూలంగా అందిపుచ్చుకున్న రాష్ట్రాలు 202021 నుండి నేటి వరకూ మూలధన పెట్టుబడితో కూడిన అనేక ప్రాజెక్టులకు అవసరమైన నిధులను ఈ ఋణాల ద్వారా సమకూర్చుకున్నాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి కూడా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరింది. 202021 నుంచి 202526 వరకు తెలంగాణ రాష్ట్రానికి రూ. 10,000 కోట్లకు పైగా వడ్డీ రహిత ఋణాలను అందించడం జరిగింది. ఈ ఋణాలతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూలధన పెట్టుబడితో కూడిన కొన్ని వందల ప్రాజెక్టులు అమలుకు నోచుకున్నాయి. మురుగునీటి నాళాలు, రోడ్ల విస్తరణ, రైల్వే లైన్ల విస్తరణ, బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్ల నిర్మాణం, ఆసుపత్రులు, మెడికల్ & నర్సింగ్ కాలేజీలు, సంక్షేమ, మైనారిటీ పాఠశాలలు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణం, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ మధ్యన రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరిమూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్ లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులు ఖర్చు చేశారు.

ముఖ్యంగా ఎంఎంటీఎస్ ఫేజ్ II కోసం రూ.200 కోట్లు, మనోహరాబాద్‌కొత్తపల్లి రైల్వేలైన్ కోసం రూ. 114 కోట్లు, స్మార్ట్ సిటీస్ పథకం కోసం రూ. 315 కోట్లు, పీఎం గ్రామ సడక్ యోజన కోసం రూ. 674 కోట్లు, ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ మధ్యన రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రూ. 200 కోట్లు, సిద్ధిపేట బైపాస్ రోడ్డు కోసం రూ. 110 కోట్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల కోసం రూ. 388 కోట్లు, పలు హాస్టళ్ల నిర్మాణం కోసం రూ. 300 కోట్లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. అన్ని రాష్ట్రాలలాగే తెలంగాణ రాష్ట్రం కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలకు కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రహిత ఋణాల మీద ఆధారపడటం చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎలాంటి దుస్థితిలో ఉందో తెలుస్తోంది. ఇవి మాత్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వం గతంలో తీసుకున్న ఋణాలకు వడ్డీలు చెల్లించడానికి ఋణాలు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ఋణాలు, రైతు భరోసా నిధులకు ఋణాలు, సంక్షేమ పథకాల అమలుకు ఋణాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఋణాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేని పరిస్థితి నేడు తెలంగాణలో ఉంది.

2014 లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్దం పడుతోంది. ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున పెరుగుతున్న రాష్ట్ర తలసరి అప్పు కూడా రాష్ట్ర ఆర్థిక దుస్థితిని తెలియజేస్తోంది. ఇలాంటి పరిస్థితులలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వాస్తవాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కాబట్టి, మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఒక పూర్తిస్థాయి శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని తెలంగాణ ప్రజల తరపున మిమ్మల్ని కోరుతున్నాను’’ అంటూ కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.



# హైడ్రాకు ఈ అక్రమ వెంచర్లు కనిపించడం లేదా..

- **నార్సింగిలో అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయంటూ కవిత ఆందోళన**
- **ఈ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్**
- **బీఆర్ఎస్ హయాంలో ఇక్కడి భవనాలకు అనుమతులు ఇచ్చారని విమర్శలు**
- **కాంగ్రెస్ లంచాలు తీసుకుని వాటికి మళ్లీ అనుమతులు ఇచ్చిందన్న కవిత**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. నార్సింగిలో మూసీ నదిని ఆక్రమించి భారీ రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్మిస్తున్నారని, వాటిపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. అక్కడి వెంచర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా ప్రజల నివాసాలు తొలగిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, పేదల ఇళ్లు కూల్చివేస్తున్న హైడ్రాకు ఈ అక్రమ వెంచర్ కనిపించడం లేదా అని నిలదీశారు. కుత్బుల్లాపూర్, ఖమ్మం వెలుగుమట్ల, మూసీ నది పరిసరాల్లో అన్నీ పేదల ఇళ్లనే కూల్చుతున్నారని ఆరోపించారు. జనం బాటలో భాగంగా అక్రమ ఇళ్ల నిర్మాణాలు, పేదల ఇళ్లు కూల్చవద్దని హైడ్రాకు ఎన్నో ఫిర్యాదులు చేశామని అన్నారు. మూసీ నది పక్కన ఉన్న పేదల ఇళ్లను కూల్చిన హైడ్రా అధినేత రంగనాథ్ కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూసీ నదిలోనే నిర్మిస్తున్న అక్రమ వెంచర్లు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. అవసరమైతే రంగనాథ్ బుల్డోజర్ తీసుకువచ్చేవరకు ఇక్కడే నిరసన చేపడతామని హెచ్చరించారు. ఖమ్మం కూడా వెళ్లి పేదల తరఫున కొట్లాడుతామని అన్నారు. 20 ఏళ్ల క్రితం కట్టిన మధ్యతరగతి వారు కొనుగోలు చేసిన అపార్టుమెంట్‌ను కూలగొట్టాలని చెబుతున్నారని, కానీ ధనికుల నిర్మాణాలకు మాత్రం అడ్డంకులు లేవని మండిపడ్డారు.




ఈ అక్రమ భవనాలకు బీఆర్ఎస్ హయాంలో అనుమతులు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల పాటు ఈ నిర్మాణాలు నిలిచిపోయాయని అన్నారు. ఆ తర్వాత లంచాలు తీసుకుని నిర్మాణాలకు తిరిగి పర్మిషన్ ఇచ్చారని ఆరోపించారు. న్యాయం అందరికీ ఒకేలా ఉండాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. కచ్చితంగా మూసీని, తెలంగాణ వనరులను పరిరక్షించుకుంటామని కవిత అన్నారు.

# అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్‌కు కొత్త దిశ

**మొదటిపేజీ తరువాయి**

మార్కెట్లలో మరింత ప్రాధాన్యం లభిస్తోందన్నారు. అయితే, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే మన ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపడాలి మాత్రమే కాదు, వాటిని మించి ఉండాలని ఆయన సూచించారు.



ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారుల అభిరుచులు, అవసరాలు వేగంగా మారుతున్నాయని ప్రధాని అన్నారు. కేవలం తక్కువ ధరలు లేదా ఎక్కువ ఉత్పత్తి సరిపోదని, నాణ్యతే అసలు విజయాన్ని నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. ఒకవేళ మన శక్తి, సామర్థ్యాలను ఒకే అంశంపై కేంద్రీకరించాల్సి వస్తే అది తప్పకుండా ‘నాణ్యత’ కావాలని ఆయన గట్టిగా చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో భారత్ తన ప్రత్యేక స్థానాన్ని సంపాదించాలంటే నాణ్యత విషయంలో రాజీ పడకూడదని హెచ్చరించారు. మన దేశంలో తయారయ్యే వస్తువులు మంచి స్థాయిలో ఉండటమే కాకుండా, విదేశీ వినియోగదారుల అంచనాలను మించి ఉండాలని ఆయన అన్నారు. అప్పుడే భారత ఉత్పత్తులపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.

పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ డి) రంగాల్లో పెట్టుబడులు పెరగాల్సిన సమయం ఇదేనని ప్రధాని అభిప్రాయపడ్డారు. కొత్త ఆలోచనలు, సాంకేతికతలు, నవకల్పనలు లేకుండా ప్రపంచ పోటీలో నిలవడం కష్టమని చెప్పారు. పరిశ్రమలు నిరంతరం అధ్యయనం చేస్తూ, ప్రపంచ మార్కెట్ ధోరణులను గమనిస్తూ, వాటికి అనుగుణంగా మారాలని సూచించారు. భారత పారిశ్రామికవేత్తలు ప్రపంచ మార్కెట్ అవసరాలను అర్థం చేసుకుని ఉత్పత్తులను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి దేశం వినియోగదారుల అవసరాలు వేరు వేరుగా ఉంటాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి చేయడం వల్లే నిజమైన లాభం పొందగలమన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా లభించే అవకాశాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే ఈ మార్పు అత్యవసరమని తెలిపారు.

భారత్ ఇప్పటికే అంతర్జాతీయ వేదికపై విశ్వసనీయ దేశంగా ఎదుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. తయారీ రంగం, సేవా రంగం, స్టార్టప్‌లు, సాంకేతిక రంగం వంటి అనేక విభాగాల్లో భారత యువత తమ ప్రతిభను నిరూపిస్తున్నారని అన్నారు. ఈ సామర్థ్యాన్ని సరైన దిశలో నడిపిస్తే భారత్ మరింత ఎత్తుకు చేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. “అభివృద్ధి మార్గం సిద్ధంగా ఉంది. ఆ మార్గాన్ని వినియోగించుకోవాల్సింది మనమే” అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానపరమైన సహకారం అందిస్తోందని, ఇప్పుడు పరిశ్రమలు ముందడుగు వేయాల్సిన సమయం వచ్చిందన్నారు.

‘మేక్ ఇన్ ఇండియా’ కార్యక్రమాన్ని ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా నిలపాలంటే ప్రతి ఉత్పత్తిలోనూ నాణ్యత ప్రతిబింబించాలని ప్రధాని తెలిపారు. మన ఉత్పత్తులపై “ఇది భారతదేశంలో తయారైంది” అనే ముద్ర గర్వకారణంగా మారాలని ఆయన ఆకాంక్షించారు. దీని కోసం సాంకేతికతను వినియోగించుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం, శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని సూచించారు. పరిశ్రమలు కేవలం లాభాలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక దృష్టితో ముందుకు సాగాలని ప్రధాని అన్నారు. స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, వినియోగదారుల విశ్వాసం - ఇవన్నీ సమానంగా ముఖ్యమని గుర్తుచేశారు. ప్రపంచ మార్కెట్లో నిలదొక్కుకోవాలంటే విశ్వసనీయత చాలా అవసరమని పేర్కొన్నారు.

భారత యువతలో ఉన్న సృజనాత్మకత, స్టార్టప్ సంస్కృతి దేశానికి బలంగా మారుతోందని ఆయన అన్నారు. ఈ శక్తిని పరిశోధన, ఆవిష్కరణల దిశగా మళ్లిస్తే భారత ఉత్పత్తులు ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందుతాయని చెప్పారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కూడా నాణ్యతను ప్రధానంగా తీసుకుని ముందుకు రావాలని సూచించారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ప్రపంచ ప్రమాణాలు అవలంబించాల్సిందేనని ప్రధాని స్పష్టం చేశారు. అంతర్జాతీయ సర్టిఫికేషన్లు, ప్రమాణాలు, సాంకేతిక అప్‌గ్రేడ్లు వంటి అంశాల్లో వెనుకబడకూడదన్నారు. కొత్త మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని వ్యూహాలు రూపొందించుకోవాలని సూచించారు.

భారత్‌కు అంతర్జాతీయ వాణిజ్యంలో విస్తృత అవకాశాలు లభిస్తున్నాయని ప్రధాని అన్నారు. ఈ అవకాశాలను విజయాలుగా మార్చాలంటే నాణ్యత, పరిశోధన, నవకల్పనలు అనే మూడు అంశాలపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, యువత - అందరూ కలిసికట్టుగా పనిచేస్తే భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మరింత బలమైన స్థానాన్ని సంపాదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్న ఈ సమయంలో ప్రతి పరిశ్రమ, ప్రతి పారిశ్రామికవేత్త తమ బాధ్యతను గుర్తించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. నాణ్యతను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేస్తే ‘మేక్ ఇన్ ఇండియా’ నిజమైన అర్థంలో ప్రపంచ బ్రాండ్‌గా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**యూట్యూబ్‌లో మోడీ హవా**

ప్రధాని నరేంద్ర మోడీకి దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ చాలామంది అభిమానులు ఉన్నారు. బయటే కాకుండా సామాజిక మాధ్యమాల్లో కూడా ఆయన హవా కొనసాగుతోంది. తాజాగా ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్ లో మోడీ ఛానల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 30 మిలియన్లు దాటింది. దీంతో ఈ వేదికపై ప్రపంచంలోనే అత్యధిక సబ్‌స్క్రైబర్లు ఉన్న రాజకీయ నేతగా మోడీ రికార్డు సృష్టించారు. రెండో స్థానంలో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో ఉన్నారు. 2007లో ప్రధాని మోడీ యూట్యూబ్ ఛానల్ ప్రారంభించారు. ఇప్పటివరకు ఆయన 33వేలకు పైగా వీడియోలను షేర్ చేశారు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే ప్రధాని మోడీకి ఉన్న సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఏడు రెట్లు ఎక్కువ. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ లోనూ మోడీ ఫాలోవర్ల సంఖ్య 10 కోట్లు దాటింది.

# అర్హులందరికీ సంక్షేమం చేరాలి



**మొదటిపేజీ తరువాయి**

మున్సిపల్ సభ్యులు, చైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్ల భాగస్వామ్యం ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వీరికి జిల్లా కేంద్రాల్లో ఒకరోజు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారి బాధ్యతలపై అవగాహన కల్పించాలని సూచించారు.

**ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కళాశాలల సేవలను ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు వంటి స్థానిక ఆసుపత్రులు అవసరమైతే మెడికల్ కళాశాలలకు రిఫర్ చేయాలని సూచించారు. ఆధునిక పరికరాలు, నిపుణుల సేవలు ప్రజలకు అందేలా చూడాలన్నారు.

విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలల్లో మానసిక నిపుణులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, ఈసిగరెట్ల వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఫేషియల్ రికగ్నిషన్ వినియోగం**

ప్రతి సంక్షేమ పథకంలో లబ్ధిదారుల ముఖ గుర్తింపు విధానం అమలు చేయాలని సీఎం చెప్పారు. అర్హులకే లబ్ధి అందాలని, అనర్హులు జాబితాలో ఉండకూడదని స్పష్టం చేశారు. ఆసరా పింఛన్లలో ఈ విధానం అమలు చేయడంతో లక్షల సంఖ్యలో అనర్హులను తొలగించగలిగామని గుర్తుచేశారు.

**సోలార్ ప్రోత్సాహం**

సోలార్ విద్యుత్ వినియోగాన్ని గ్రామస్థాయిలో ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ పంపు సెట్లకు బదులుగా సోలార్ పంపు సెట్లు వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇళ్లపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి గ్రిడ్‌కు కనెక్ట్ చేయడం ద్వారా ఆదాయం పొందే అవకాశాలపై ప్రజలకు వివరించాలని చెప్పారు.

**రవాణా, రహదారుల భద్రత**

రవాణాశాఖ డేటాను పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. పాఠశాల బస్సులు, సరకు రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు క్రమంగా నిర్వహించాలని సూచించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. రహదారులపై గుంతలు, ప్రమాదకర ప్రాంతాల సమాచారం కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఓఆర్ఆర్ మరియు సర్వీస్ రోడ్ల వెంట చెత్త డంపింగ్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**వ్యవసాయానికి కార్యాచరణ**

భూసార పరీక్షలు చేపట్టి రైతులకు సరైన సలహాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖను సీఎం ఆదేశించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుకు ప్రోత్సాహం ఇవ్వాలని, పంట మార్పిడి, వైవిధ్యంపై అవగాహన కల్పించాలని చెప్పారు. యూరియా యాప్ వినియోగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, నానో యూరియా ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో చూపించాలని సూచించారు. వ్యవసాయ, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**మధ్యాహ్న భోజనం, హాస్టళ్ల పర్యవేక్షణ**

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు సమయానికి చెల్లించాలని సీఎం ఆదేశించారు. పిల్లలకు పోషకాహారం అందేలా పర్యవేక్షణ బలోపేతం చేయాలని చెప్పారు. పట్టణాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, బాలురబాలికల హాస్టళ్ల వివరాలను నమోదు చేసి పర్యవేక్షణ పెంచాలని సూచించారు.

**99 రోజుల ప్రణాళిక – ఐదు దశలు**

మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ అమలు చేయనున్నారు. ప్రణాళిక శాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తుంది.

* ఏప్రిల్ 2 - గ్రామసభలు
* ఏప్రిల్ 16 - మండల స్థాయి కార్యక్రమాలు
* మే 2 - నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు
* మే 22 - జిల్లా స్థాయి సమీక్షలు
* జూన్ 2 - రాష్ట్ర ఆవిర్భావ వేడుక

శాఖల వారీగా 10 ప్రధాన అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి.

**ప్రత్యేక యాప్‌తో పర్యవేక్షణ**

ఈ కార్యక్రమం అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. శాఖల వారీగా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఈ 99 రోజుల్లో నిర్వహించనున్నారు. మొత్తానికి, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థ, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు యంత్రాంగం చురుకుగా పనిచేయాలని సీఎం స్పష్టంగా సూచించారు.

# బస్తీ దవాఖానలో కాలం చెల్లిన మందులు

- **జాతీయ మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు**

**సికింద్రాబాద్, మార్చి 03 ( డిడి9 వార్త):**

సికింద్రాబాద్‌లోని రసూల్‌పురా బస్తీ దవాఖానలో కాలం చెల్లిన మందులు వెలుగులోకి రావడం కలకలం రేపింది. ప్రజారోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం బయటపడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రముఖ న్యాయవాది రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన పిటిషన్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణకు ఆదేశించింది.8 తెలంగాణ వైద్యశాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసి, నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. కాగా ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయండి..

**మొదటిపేజీ తరువాయి**



మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ తదితర జిల్లాల కలెక్టర్లు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పరిపాలనా విధానాలపై మంత్రి వారితో చర్చించారు.

**సంక్షేమం ప్రతి అర్హుడికి చేరాలి**

గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈ పథకాలు కాగితాలపైనే కాకుండా నిజంగా అర్హులైన ప్రతి వ్యక్తికి చేరేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల అవసరాలను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

**ప్రజలతో మమేకం కావాలి**

జిల్లా పరిపాలనలో కలెక్టర్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్‌గా పని చేయడం ఒక పెద్ద అవకాశం అని చెప్పారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉండే ఈ బాధ్యతలో మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాలంటే క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని, గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యక్షంగా ప్రజలతో మాట్లాడాలని మంత్రి అన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకుని పరిపాలనలో అమలు చేయాలన్నారు.

**మానవీయ కోణంలో నిర్ణయాలు**

ప్రజలకు మేలు చేసే నిర్ణయాలే తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం నిబంధనలు మాత్రమే కాకుండా, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మానవీయ కోణంలో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, బలహీన వర్గాలకు సంబంధించిన అంశాల్లో వేగంగా స్పందించాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అమలు చేసే సమయంలో పారదర్శకత పాటించాలని, లబ్ధిదారుల ఎంపికలో న్యాయం జరగాలని మంత్రి అన్నారు. ఎవరైనా అర్హులు నష్టపోకుండా చూడాలని సూచించారు.

**టీమ్‌గా పని చేయాలి**

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ యంత్రాంగం ఒక టీమ్‌లా పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పని చేస్తేనే లక్ష్యాలు సాధ్యమవుతాయని చెప్పారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కార మార్గాలు అన్వేషించాలని సూచించారు. పరిపాలనలో ఆలస్యం, నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.

**జిల్లాల్లో అనుభవం భవిష్యత్తుకు బలం**

జిల్లాల్లో పనిచేసే అనుభవం భవిష్యత్తులో అధికారులకు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో పని చేయడం ద్వారా పరిపాలనా పటిమ పెరుగుతుందని అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉండే ఈ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు.

**ప్రజాకేంద్ర పాలనకు ప్రాధాన్యం**

ప్రజాపాలనలో ప్రజలే కేంద్రబిందువుగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు మేలు చేసే పనులే జిల్లా పాలకుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు సమర్థంగా అమలైతేనే రాష్ట్రం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మొత్తానికి, ప్రజా ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో జిల్లా కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా అమలు చేసి, అర్హులైన ప్రతి వ్యక్తికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

- **9 మంది పేర్లతో జాబితా విడుదల**
- **ఇంకా ఏ నిర్ణయం తీసుకోని కాంగ్రెస్**
- **నేడు ఢిల్లీకి తెలంగాణ కాంగ్రెస్ పెద్దలు**
- **అధిష్టానంతో కీలక చర్చలు**
- **నేడు అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**




రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో కదలికలు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలో బీజేపీ మంగళవారం తొమ్మిది మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఇందులో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పేరు ఉండటం ప్రత్యేకంగా చర్చనీయాంశమైంది. ఆయన బిహార్ నుంచి రాజ్యసభకు పోటీ చేయనున్నారు.

రాజ్యసభకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ ఫిబ్రవరి 18, 2026న ప్రకటించింది. దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన మొత్తం 37 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలు ఏప్రిల్ నెలలో ఖాళీ కానున్నాయి. దీంతో ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరైంది. తెలంగాణ నుంచి రెండు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. సురేశ్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీల పదవీ కాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. దీంతో రాష్ట్రంలోనూ రాజకీయ కదలికలు ముమ్మరమయ్యాయి. బీజేపీ కొందరు పేర్లతో జాబితా విడుదల చేయగా ఇంకా కొన్ని రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధిష్టానం చర్చలు కొనసాగిస్తోంది.

**బీజేపీ విడుదల చేసిన**
**జాబితాలో ఈ క్రింది పేర్లు ఉన్నాయి:**

1. నితిన్ నబిన్ - బిహార్
2. శివేష్ కుమార్ - బిహార్
3. తేరష్ గోవాలా - అస్సాం
4. జొగెన్ మోహన్ - అస్సాం
5. లక్ష్మి వర్మ - ఛత్తీస్‌గఢ్
6. సంజయ్ భాటియా - హరియాణా
7. మన్మోహన్ సామేల్ - ఒడిశా
8. సుజీత్ కుమార్ - ఒడిశా
9. రాహుల్ సిన్హా - పశ్చిమ బెంగాల్

**తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ**

తెలంగాణలో రాజ్యసభ టికెట్ల కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై ఇంకా స్పష్టత రాలేదు. నామినేషన్ల చివరి తేదీ (మార్చి 5) సమీపిస్తున్నా పార్టీ అధిష్టానం కసరత్తు కొనసాగిస్తోంది. ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీతో జరిగిన సమావేశంలో అభ్యర్థుల విషయంలో క్లారిటీ వస్తుందని భావించినా, అలాంటి ప్రకటన వెలువడలేదు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ, అభ్యర్థుల ఎంపికపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రేసులో ఉన్న పేర్లను ఇప్పుడే వెల్లడించలేమని, అన్ని రాజకీయ సమీకరణాలు, సామాజిక సమతుల్యత, పార్టీ వ్యూహాలు పరిశీలించిన తర్వాతే ఏఐసీసీ తుది నిర్ణయం ప్రకటిస్తుందని స్పష్టం చేశారు.

**ఢిల్లీ పర్యటనకు రాష్ట్ర నేతలు**

రాజ్యసభ అభ్యర్థుల ఖరారుపై చర్చించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ఢిల్లీకి వెళ్లనున్నట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. బుధవారం అభ్యర్థులపై స్పష్టత వచ్చే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**రాజకీయంగా కీలక ఎన్నిక**

రాజ్యసభ స్థానాలు రాష్ట్రాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ముఖ్యంగా తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు స్థానాలపై అన్ని పార్టీలూ దృష్టి సారించాయి. అసెంబ్లీలో పార్టీ బలం, కూటమి సమీకరణాలు, రాజకీయ వ్యూహాల ఆధారంగా ఫలితాలు మారే అవకాశం ఉంది. బీజేపీ ఇప్పటికే తన అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో ఎన్నికల వేడి మరింత పెరిగింది. కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటనపై ఇప్పుడు అందరి దృష్టి ఉంది. రాబోయే రెండు మూడు రోజుల్లో రాజకీయంగా కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# యథేచ్ఛగా అక్రమ క్వారీలు

- **నిబంధనలకు తూట్లు**
- **ప్రభుత్వ ఆదాయానికి గండి**
- **మైనింగ్ దందా కనిపించడం లేదా?**
- **దోచుకున్న సంపదను పెనాల్టీతో రికవరీ చేయాలి**
- **మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

నిబంధనలకు తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ క్వారీలతో సహజ సంపదను కొల్లగొట్టే గలీజ్ దందా రాష్ట్రంలో జరుగుతున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పీసీబీ, హెచ్‌ఎండీఏ అధికారులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రశ్నించారు. రాత్రి పగలు తేడా లేకుండా భారీ యంత్రాలతో బండరాళ్లను తొలుస్తూ, అక్రమంగా తరలిస్తూ యథేచ్ఛగా వ్యాపారం చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని అడిగారు. మంగళవారం ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్ అయ్యారు.

**చట్టబద్ధ అనుమతులు లేకుండా..**

ఓఆర్ఆర్‌కు ఆనుకుని ఉన్న రాజేంద్రనగర్ మండలంలోని మానసహిల్స్ ప్రాంతంలో ఓ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా అక్రమ క్వారీలు నిర్వహిస్తూ కొండలను పిండి చేసి కోట్లు దండుకుంటుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటున్నదని ప్రశ్నించారు. నెలల తరబడి కొండలను పిండి చేసి, భారీగా కాంక్రీట్ తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు ఎందుకు మౌనం పాటిస్తున్నాయని నిలదీశారు. యావత్ ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు మొద్దు నిద్ర నటిస్తున్నదని నిలదీశారు. ఆయా శాఖల్లోని విజిలెన్స్ విభాగాలు పని చేయడం లేదా అని అడిగారు. టీఎస్‌పీసీబీ నుంచి కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్‌ఈ), కన్సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌ఓ) అనుమతి లేదని, పర్యావరణ అనుమతి కూడా లేదన్నారు. మైనింగ్/క్వారీయింగ్ లీజ్ అనుమతి, మైన్స్, జియాలజీ విభాగం అనుమతి లేదన్నారు. స్థానిక గ్రామపంచాయతీ/మున్సిపల్ అనుమతి ల్యాండ్ యూజ్ మార్పిడి, హెచ్‌ఎండీఏ క్లియరెన్స్ లేదని వివరించారు. అదే విధంగా విస్ఫోటక పదార్థాల వినియోగం కోసం ఎక్స్‌ప్లోసివ్స్ లైసెన్స్ లేదని, గ్రౌండ్ వాటర్ వినియోగానికి సంబంధిత అనుమతులు కూడా లేవన్నారు. అలాగే, రెవెన్యూ అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఏ అనుమతి లేకుండా అక్రమంగా క్వారీ నిర్వహిస్తూ కొండలను మాయం చేస్తూ భారీ స్థాయిలో రాళ్లు, కాంక్రీట్ తరలించడం చట్టవిరుద్ధం అనే విషయం తెలియదా అని ప్రశ్నించారు.

**ప్రభుత్వం ఏం చేస్తోంది?**

మరోవైపు, క్వారీ కోసం ఎలాంటి బిడ్డింగ్ లేకుండా గంపగుత్తగా 17 ఎకరాల ప్రభుత్వ భూమి నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో కట్టబెడుతున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం జరుగుతున్నదని, ఓపెన్ బిడ్డింగ్ పిలవాలని తాము డిమాండ్ చేస్తే మూడు రోజులు అయినా ఉలుకు పలుకు లేదని ఆరోపించారు. అసలు రాష్ట్రంలో ఉన్నది ప్రభుత్వమా, లేక రియల్ ఎస్టేట్ కంపెనీనా అని నిలదీశారు. హైడ్రా అంటే



హదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటక్షన్ ఏజెన్సీ అని గొప్పలు చెప్పడమే తప్ప ప్రభుత్వ ఆస్తిని అప్పనంగా తన్నుకు పోతుంటే ఎందుకు ప్రొటెక్ట్ చేయడం లేదని నిలదీశారు. శని, ఆదివారాలు వచ్చిందంటే చాలు పేదల ఇళ్ల మీదకు వెళ్లే హైడ్రా బుల్‌డోజర్‌కు ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ క్వారీ కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మైనింగ్ దందా కనిపించకపోతే చెప్పండి, స్వయంగా తానే వచ్చి చూపిస్తానని, అక్కడే నిజానిజాలు నిగ్గు తేల్చుదాం అని హరీశ్ రావు ఛాలెంజ్ చేశారు.

## విద్యుత్ వినియోగంలో తెలంగాణ రికార్డు

**మొదటిపేజీ తరువాయి**

అందరికీ ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ సమర్థవంతమైన ప్రణాళిక, సమన్వయంతో పనిచేసిందని పేర్కొన్నారు.

**రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనం**

18,139 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను సాఫీగా నిర్వహించడం తెలంగాణ ఆర్థిక పురోగతికి నిదర్శనమని ఉపముఖ్యమంత్రి తెలిపారు. భౌగోళికంగా చిన్న రాష్ట్రం అయినప్పటికీ, పెద్ద రాష్ట్రాలకు సమానంగా విద్యుత్ వినియోగ స్థాయికి చేరుకోవడం గర్వకారణమని అన్నారు.రాష్ట్రంలో పారిశ్రామిక రంగం, ఐటీ, ఔషధ తయారీ, తయారీ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. అలాగే సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ విస్తరణ, కొత్త పరిశ్రమల స్థాపన వల్ల విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని వివరించారు.

**జాతీయ స్థాయిలో తెలంగాణ స్థానం**

తెలంగాణ నమోదుచేసిన 18,139 మెగావాట్ల గరిష్ట డిమాండ్ దేశంలోని పెద్ద రాష్ట్రాలకు సమానంగా ఉందని పేర్కొన్నారు. సుమారు 19,900 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైన మధ్యప్రదేశ్, 19,600-20,600 మెగావాట్ల మధ్య డిమాండ్ నమోదైన రాజస్థాన్ వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ సామర్థ్యం స్పష్టమవుతోందన్నారు.భూభాగం, జనాభా పరంగా చిన్నదైనా విద్యుత్ వినియోగ సాంద్రతలో తెలంగాణ ముందంజలో ఉందని చెప్పారు. పంజాబ్, హర్యానా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి పారిశ్రామిక రాష్ట్రాల కంటే ఎక్కువ గరిష్ట డిమాండ్ నమోదు కావడం రాష్ట్ర ప్రగతిని సూచిస్తోందన్నారు.

**సంవత్సరానికో కొత్త రికార్డు**

గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న తీరు స్పష్టంగా కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి తెలిపారు.

* 202324లో గరిష్ట డిమాండ్ 15,623 మెగావాట్లు నమోదైంది.
* 202425లో ఇది 17,162 మెగావాట్లకు పెరిగింది.
* 202526లో కూడా 17,162 మెగావాట్ల గరిష్ట స్థాయిని తాకింది.
* తాజాగా 2026లో 18,139 మెగావాట్లకు చేరుకుని కొత్త రికార్డు సృష్టించింది.

ఈ గణాంకాలు రాష్ట్రంలో విద్యుత్ వినియోగం వేగంగా పెరుగుతోందని స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు.

**ముందస్తు ప్రణాళికలతో సిద్ధం**

రాబోయే వేసవిలో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బలమైన ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్, సమర్థవంతమైన గ్రిడ్ నిర్వహణ, అదనపు ఉత్పత్తి సామర్థ్యాల వినియోగం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని చెప్పారు.విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు విద్యుత్ కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లు కూడా చేశామని తెలిపారు.

**సమన్వయమే విజయ రహస్యం**


కంట్రోల్ రూమ్‌ల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే లైన్‌మెన్ల వరకు ప్రతి ఉద్యోగి కృషి వల్లే ఈ రికార్డు సాధ్యమైందని ఉపముఖ్యమంత్రి కొనియాడారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ విభాగాలు సమన్వయంతో పనిచేయడం వల్లే గరిష్ట డిమాండ్ సమయంలో కూడా ఎటువంటి లోపాలు తలెత్తలేదన్నారు.

**అభివృద్ధికి బలం – నాణ్యమైన విద్యుత్**

తెలంగాణలో పరిశ్రమలు, వ్యవసాయం, పట్టణాభివృద్ధి వేగంగా సాగడానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా కీలకమని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, పరిశ్రమలకు నిరంతర సరఫరా, గృహ వినియోగదారులకు అంతరాయం లేని సేవలు అందించడం ప్రభుత్వ కట్టుబాటు అని తెలిపారు. విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు సాంకేతికతను వినియోగిస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. స్మార్ట్ మీటర్లు, ఆధునిక సబ్‌స్టేషన్లు, గ్రిడ్ మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి పెట్టినట్లు వెల్లడించారు.

**ఇతర రాష్ట్రాలకు ఆదర్శం**

భౌగోళికంగా చిన్న రాష్ట్రం అయినప్పటికీ, అధిక విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందని ఉపముఖ్యమంత్రి అన్నారు. సమగ్ర ప్రణాళిక, పారదర్శక పరిపాలన, సిబ్బంది కృషి వల్లే ఈ స్థాయికి చేరుకున్నామని తెలిపారు.18,139 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించడం తెలంగాణ విద్యుత్ రంగానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాబోయే కాలంలో కూడా పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి వేగాన్ని కొనసాగించేందుకు విద్యుత్ రంగం సిద్ధంగా ఉందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుచూపుతో చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి తెలిపారు.



## మధ్యప్రాచ్య ఉద్రిక్తతలపై కాంగ్రెస్ ఆందోళన

- **కేంద్రం వైఖరి ప్రకటించాలని రాహుల్ డిమాండ్**
- **భారతీయుల భవిష్యత్‌పై అనిశ్చిత్తి నెలకొందని వ్యాఖ్య**
- **అంతర్జాతీయ చట్టాల ప్రస్తావించిన రాహుల్**
- **పార్లమెంట్‌లో చర్చించాలన్న సోనియా గాంధీ**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తారు. అంతర్జాతీయ వేదికపై భారత్ స్పష్టమైన అభిప్రాయం వెల్లడించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో చేసిన పోస్టులో మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న అస్థిరతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల వల్ల అక్కడ నివసిస్తున్న భారతీయుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందని పేర్కొన్నారు. హింసాత్మక చర్యలు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని హెచ్చరించారు.

**మౌనంపై ప్రశ్నలు**

ప్రధాని నరేంద్ర మోడీ ఈ సంక్షోభ సమయంలో మౌనం పాటించడం సరైంది కాదని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ఒక దేశంపై ఏకపక్ష దాడులు జరగడం, అలాగే ప్రతీకార దాడులు కొనసాగడం పరిస్థితిని విషమం చేస్తాయని అన్నారు. సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యలను భారత్ ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత విదేశాంగ విధానం ఎప్పుడూ శాంతి, చర్చలు, దౌత్యపరమైన పరిష్కారాలపైనే ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. “హింసకు ప్రతిగా హింసే వస్తుంది. చర్చలు, సంయమనం ద్వారానే శాంతి సాధ్యం” అని ఆయన పేర్కొన్నారు.

**అంతర్జాతీయ చట్టాల ప్రాధాన్యం**

ఒక దేశాధినేతను లక్ష్యంగా చేసుకుని జరిపే హత్యలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలపై భారత్ తన స్పష్టమైన అభిప్రాయం ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ వేదికపై నైతిక స్పష్టత చూపాల్సిన సమయం ఇదేనని తెలిపారు.

**సోనియా గాంధీ విమర్శలు**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా స్పందించారు. ఒక వ్యాసంలో ఆమె భారత విదేశాంగ విధానం దిశ, విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలపై ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం ఏ దేశ ప్రాదేశిక సమగ్రతకు వ్యతిరేకంగా బలప్రయోగం చేయరాదని ఆమె గుర్తుచేశారు. పనిచేస్తున్న దేశాధినేతపై లక్ష్యంగా దాడులు జరగడం అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు.

**గల్ఫ్ ప్రాంతంలో భారతీయుల భద్రత**

మధ్యప్రాచ్య దేశాల్లో కోట్లాది భారతీయులు నివసిస్తున్నారని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారితే వారి భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. గతంలో గల్ఫ్ యుద్ధం, యెమెన్, ఇరాక్, సిరియా వంటి ప్రాంతాల నుంచి భారత పౌరులను సురక్షితంగా తరలించిన అనుభవం దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో దౌత్యపరమైన సమతుల్యత, విశ్వసనీయత అత్యంత అవసరమని సోనియా గాంధీ పేర్కొన్నారు. భారత్‌కు ఇరాన్, ఇజ్రాయెల్ రెండింటితోనూ సంబంధాలు ఉన్నాయని, ఆ సంబంధాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

**పార్లమెంట్‌లో చర్చకు డిమాండ్**

రాబోయే బడ్జెట్ సమావేశాల్లో అంతర్జాతీయ పరిస్థితులపై విస్తృత చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దేశ విదేశాంగ విధానం పారదర్శకంగా ఉండాలని, ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరింది.

**కేంద్రం స్పందనపై ఎదురుచూపులు**

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే దౌత్యపరమైన మార్గాల్లో పరిస్థితిని పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ ఏ వైఖరి అవలంబించబోతుందనే అంశంపై దేశ రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. కాంగ్రెస్ నేతలు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతుండగా, కేంద్రం దౌత్యపరమైన సమతుల్యతను పాటించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.



# ఘనంగా హోలీ వేడుకలు

- **హోలీ సందర్భంగా బజార్ హత్నూర్లో కుస్తీ పోటీలు.**

**బజార్ హత్నూర్, మార్చి 3 (డిడి9న్యూస్):-**









బజార్ హత్నూర్ మండలకేంద్రంలోని పులాజి బాబా ధ్యాన మందిరం సమీపంలో మంగళవారం రోజు హోలీ పండుగ సందర్భంగా కుస్తీ పోటీలనునిర్వహించారు.ఈపోటీలు గ్రామ సర్పంచ్ పర్చ సాయన్న ప్రారంభం చేశారు. ముందుగా చట్ల గజ్జారాం చిత్ర పటానికి నివాళులు అర్పించి పోటీలు ఆరంభం చేశారు. ప్రతీ సంవత్సరం జరిగే కుస్తీ పోటీలలో చట్ల గజ్జరాం చాలా ఉత్సాహంతో వచ్చి ముందు వరుసలో ఉండి పోటీలు నిర్వహింప చేసే వారు కనుక ఈ సంవత్సరంఆయన లేని లోటు కనిపించడంతో ముందుగా ఫొటోకు నివాళి అర్పించి, పోటీలు పెట్టారు. బజార్ హత్నూర్ గ్రామంలో ఉదయం నుంచి యువకులు, బాలురు, బాలికలు రంగులు(హోలీ )ఆడారు. ఒంటి గంటకు యువకులు, సర్పంచ్, గ్రామ పెద్దలు, కుస్తీ పోటీలకు దిగే మల్లయోధులు, వివిధ ప్రాంతాల నుంచి కుస్తీల పోటీలలో పాల్గొనుటకు, అట్లే తిలకించుటకు వచ్చిన వారు డప్పుల చెప్పుళ్లతో, యువకుల కేరింతలు, అల్లరి చేష్టలతో కుస్తీ పోటీలు జరిగే మైదానంకు తరలి వెళ్లారు.చక్కర హారాలు, కుడుకల పేర్లతోమల్లయోధుల మధ్య కుస్తీల పోటీలు మొదలై సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది.ఈ పోటీలు ఎంతో ఉత్సవ భరింతంగా, ఉత్కంట ను నెలకోపుతూ కొనసాగింది.డప్పుల చెప్పుల్లు, కొలహలం ఎంతో ఆకర్షణ కలగించే విదంగా పండుగ వాతావరణం నెలకొంది. హోలీకి ఒక రోజు ముందు రాత్రి ప్రధాన కూడలిలలో పిడుకలతో పేర్చిన ప్రదేశంలో హోలీక దహనం (కామ దహనం )చేశారు. అక్కడ నుంచి తెచ్చిన అగ్నిని ఇళ్లకు తెచ్చుకొని ఇళ్ల వద్ద పిడుకలు పేర్చి శనగలు లేదా కొబ్బరి కుడుకలను కాల్చి పలహారం లాగా తీసుకునటం అనవాహితీ. కాలిన బూడిదను భద్ర పర్చి ఉంచుకుంటారు. దీన్ని కాముడు బూడిదగా పిలుస్తారు. ఈ బూడిదను చిన్నలకు, పెద్దలకు బొట్టుగా పెడితే కొన్ని సందర్భంలలో భయం అనేది ఉండదని పూర్వం నుంచి వస్తున్న భావన.ఈ సందర్భంగా బజార్ హత్నూర్ పోలీస్ అధికారులు భద్రత చర్యలు తీసుకున్నారు.బజార్ హత్నూర్లో ఈ కుస్తీ పోటీలు నిర్వహించడం అనేది.ఈ గ్రామం వెలసినప్పటి నుంచి ఆనవాహితీగా వస్తుంది.బజార్ హత్నూర్ గ్రామం 100 సంవత్సరాల క్రితం నిజాం రాజుల పరిపాలన కాలంలో నాందేడ్ జిల్లా లోని బైంసా పరిసరాల గ్రామాల నుంచి అప్పటి భూస్వామి అయిన రంగారావ్ పల్సికర్ వారసుల వెంట ప్రజలు వలస వచ్చారు.ఆ కాలంలో ఇదిమొత్తం అటవీ ప్రాంతం పల్సి భూస్వాముల ఆధీనంలో ఉండేది. వారితో ప్రస్తుతం నిర్మల్ జిల్లా కుబీర్ మండలం లోని పల్సి, పాలజ్, రాజురా, బైంసా, చోండి, పార్డి, బామిని, తురాటి, దివిషి, కాండ్లి, కుప్తి, చికిలి, తురాటి కుంటాల, ఓలా ముధోల్ బోసి, బెల్తారోడా, దేగామ, కుంసరం తదితర గ్రామంల నుంచి వచ్చి భూస్వాముల ఆదేశాల మేరకు భూములు నరికి పోడు వ్యవసాయం సాగు చేశారు. అక్కడ ఉన్న ఆచార, వ్యవహారాలు, పండుగలు కుబీర్ మండలంలో ఎలా చేస్తారో ఇక్కడ కూడా అలాగే చేస్తువస్తూన్నారు. కొంతమంది పూర్వీకులు కుబీర్ ప్రాంతంలో ఉండిపోయారు. ఇప్పటికి చుట్టరికాలు రాకపోకలు ఉన్నవి.అయితే బజార్ హత్నూర్ గ్రామంలోని అతి పురాతన శివాలయం వద్ద ఈ కుస్తీల పోటీలు 100 ఏళ్ల క్రితం ఆరంభం అయినవి. అప్పుడు భూస్వాములు ఈ పోటీలు చూసి ఆనందం వ్యక్తం చేస్తూ బహుమతులు ఇచ్చే వారు. ఈ పోటీలు మహాదేవుని పౌర్ణమి రోజు జరిగేవి మహాదేవుని పౌర్ణమి అంటే హనుమాన్ జయంతికి. మల్ల యుద్ధం అనేది. భారతంలోభీముడు, దుర్యోదనుల మధ్య భీకరంగా జరిగేది. అట్లనేరామాయణంకాలం లో వాలి, సుగ్రీవుల మధ్య జరిగింది.ఈ ప్రదేశం దండ కారణ్యంగాప్రసిద్ధి.రామాయణం కాలంలో రామలక్ష్మణులు అడుగుడిగిన ప్రదేశంగా,మహా భారత కాలంలో పాండవులు లక్కఇంటి నుంచి తప్పించుకొని ఈ కీకారణ్యంలో తిరిగిగారు అప్పుడు వారు ఎందరితో యుద్దాలు, మల్ల యుద్దాలలు చేసినారు. వారివారసత్వంగానే ఈ మహారాష్ట్ర ఆచారం 100 ఏళ్ళు పై బడినప్పటికి కొనసాగుతుంది.మొదటగా ఈ కుస్తీ పోటీలు అప్పటి భూస్వాముల అధ్వర్యంలో దేవుని మందిరం వద్ద కొనసాగేది. వార సంత, ఎడ్లు కొనుడు అమ్ముకునుడు ఎడ్ల బజార్ కూడా ఇక్కడే జరిగేది. బజార్ చాలా పెద్దగా జరిగేది. వివిధ ప్రదేశం ల నుంచి వ్యాపారులు వచ్చే వారు కనుకనే ఈ ఊరికి హత్నూర్ (బి ) బదులుగా బజార్ తోడు కావడంతో బజార్ హత్నూర్ గా స్థిర పడింది. లేకుంటే హత్నూర్ (కే ), హత్నూర్ (బి ) మొదటి పేర్లు. హత్నూర్ (కే )కుర్ద్ చిన్నది, హత్నూర్ (బి )అంటే బుర్జుగో పెద్దది అని ఉర్దూ భాషా పరంగా అర్థం. హత్నూర్ (కే ) ప్రస్తుతం చిన్నహత్నూర్ గ్రామం మొత్తం తోటి గిరిజనులు కనుక అది ఏజెన్సీ గ్రామం ఆ ఊరికి శివారం లేదు.అంతా వలస కూలీలే. హత్నూర్(బి )కు రెవిన్యూ శివారం ఉంది.బజార్ హత్నూర్ అసలుఏజెన్సీగ్రామంకూడాకాదు.ఒకప్పుడుప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారికి ఏజెన్సీలో విధులు నిర్వహిస్తే ప్రోత్సాహం కోసం జీతంతో పాటు అదనపు ఖర్చులుకింద ఎక్కువ డబ్బులు ప్రభుత్వం చెల్లించేది.దాని కోసం చిన్న హత్నూర్ బజార్హత్నూర్ శివారంలోని వలస గ్రామానిని భూచిగా చూపి లాభం పొందుతున్నారు.ఏజెన్సీ గ్రామాలు గుర్తించే నాటికి ఈ ఊరిలో ఓకటి, రెండు గిరిజన కుటుంబంలు భూస్వాముల వెంట వచ్చిన వారు ఉండేది.అంటే 12%కూడా లేకుండే అన్న మాట ఏజెన్సీ గ్రామంగా గుర్తించాలి అంటే అప్పటి జనాభ లెక్కల ప్రకారం కనీసం 60% గిరిజన కుటుంబంలు నివాసం ఉండాలి అప్పుడు లేదు. ఇప్పటికి బజార్ హత్నూర్@ హత్నూర్ (బి ) గ్రామం ఏజెన్సీ కాదని దీన్ని తొలగించాలని ఈ గ్రామస్తులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు.



## కోడిచర్ల గ్రామంలో ఘనంగా హోలీ సంబరాలు

**నిజామాబాద్ పోతంగల్, మార్చి 03 (డిడి9 వార్త):**

కోడిచర్ల గ్రామంలో హోలీ పండుగను గ్రామస్తులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే యువకులు, చిన్నారులు రంగులతో ఒకరినొకరు అలరించుకుంటూ పండుగ సంబరాల్లో మునిగిపోయారు.హోలీ పండుగ హిందువుల వసంతకాల వేడుకగా గుర్తింపు పొందింది. రంగుల పండుగగా పేరు గాంచిన ఈ వేడుకను భారతదేశంతో పాటు నేపాల్, బంగ్లాదేశ్ దేశాలలో కూడా ఉత్సాహంగా జరుపుకుంటారు. భారతదేశంలోని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హోలీని "దోల్ యాత్రా" లేదా "బసంతోత్సవం"గా పిలుస్తారు.అలాగే బ్రజ్ ప్రాంతంలో హోలీ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మథుర, బృందావనం, నందగావ్, బర్సానా వంటి శ్రీకృష్ణునికి సంబంధించిన ప్రదేశాల్లో హోలీ పండుగ అత్యంత వైభవంగా జరుగుతుంది.కోడిచర్ల గ్రామంలో జరిగిన ఈ వేడుకల్లో యువకులు హర్షాతిరేకంతో పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామ పెద్దలు శాంతి, సౌభ్రాతృత్వం, సాంస్కృతిక ఐక్యతకు హోలీ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## రేవంత్ రెడ్డి అధ్యక్షతన "ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక"పై సమీక్ష

**కామారెడ్డి, ఫిబ్రవరి 03(డిడి9 వార్త):**

మర్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్న "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ హాజరయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి చేపట్టాల్సిన చర్యలు, ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగవంతంగా అందించే విధానాలపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. జిల్లా స్థాయిలో సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు.



## ఆఖరి కుస్తీ పోటీలో విజయం పొందిన విజేతకురూపాయలు 5100/బహుమానం.

**బజార్ హత్నూర్, మార్చి 3(డిడి9న్యూస్ ):-**

బజార్ హత్నూర్ మండల కేంద్రంలోహోలీసందర్భంగామంగళవారం రోజు కుస్తీ పోటీలలో భాగంగా ఆఖరి కుస్తీలో గెలుపొందిన మల్ల యోధునికి బజార్హత్నూర్ పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు క్రీ. శే.చట్లగజ్జయ్య జ్ఞాపకార్థం ఆయన పుత్రుడు చట్ల తరుణ్ కుమార్ రూపాయలు 5100/లను విజేతకు అందజేశారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ పరిచకే సాయన్న, వినీల్, రాజన్న, తరుణ్ కుమార్, పలువురు పుర ప్రముఖులు తదితరులు ఉన్నారు.



## బ్లడ్‌మూన్‌ను చూశారా.. సంపూర్ణ చంద్రగ్రహణం ఫస్ట్ ఫోటోను చూసేయండి..!

**బజార్ హత్నూర్, మార్చి 3.(డిడి9న్యూస్ ):-**

ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం కనువిందు చేసింది. చంద్రగ్రహణం సందర్భంగా చందమామ పూర్తి రక్తవర్ణంలో దగదగ మెరిసిపోయింది. భారతదేశంలోని పలు ప్రాంతాలతో పాటు.. ఉత్తర అమెరికా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, కాలిఫోర్నియా సంపూర్ణచంద్రగ్రహణం స్పష్టంగా కనిపించింది. ఆయా దేశాలతో పాటు ఇండియాలో రక్తవర్ణంలో కనువిందు చేసిన చంద్రుడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి..



## మూసీ తీరాల్లో పర్యావరణ విధ్వంసం

- **ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు**

**సికింద్రాబాద్,మార్చి 03 ( డిడి9 వార్త ):**

మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని మూసీ నది తీర ప్రాంతాల్లో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించారు.మూసీ నది పరిధిలోని లంగర్ హౌస్, నర్సింగి, రాందేవ్‌గూడ ప్రాంతాల్లో శతాబ్దాల వయస్సు గల వేలాది చెట్లను సమగ్ర అధ్యయనం లేకుండానే నరికివేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పర్యావరణ, సామాజిక ప్రభావాలపై ఎటువంటి అధ్యయనం చేయకుండా పనులు చేపట్టారని ఆరోపించారు. ప్రాజెక్ట్ అమలు సంస్థ మూసీ రివర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి. నరసింహా రెడ్డికి చెట్ల నరికివేతను తక్షణమే నిలిపివేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభావిత కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని కూడా కోరారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ డైరీ నంబర్ 4637/ఐఎన్/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. మూసీ తీరాల రక్షణకు చట్టపరమైన పోరాటం కొనసాగుతుందని రామారావు ఇమ్మనేని తెలిపారు.



## నసురుల్లాబాద్‌లో కోతుల దాడి

- **మహిళకు గాయాలు – భయాందోళనలో ప్రజలు**

**నసురుల్లాబాద్, మార్చి 03(డిడి9 వార్త):**

మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రరూపం దాల్చింది. గుంపులుగా సంచరిస్తున్న కోతులు ప్రజలపై దాడులకు దిగుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఓ మహిళపై కోతి దాడి చేసి గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల ప్రకారం, మండల కేంద్రంలోని ఓ కాలనీలో ఇంటి ముందర పనులు చేసుకుంటున్న మహిళపై ఆకస్మికంగా దూసుకొచ్చిన కోతి ఆమె కాలి భాగాన్ని కర్చింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.మండల కేంద్రంలో వందల సంఖ్యలో కోతులు ఇళ్ల పైకప్పులు, విద్యుత్ తీగలు, వీధుల్లో సంచరిస్తూ ఆహారం కోసం ఇళ్లలోకి చొరబడి సరుకులు ధ్వంసం చేస్తున్నాయని స్థానికులు తెలిపారు. పాఠశాలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది.గత కొంత కాలంగా కోతుల దాడులు పెరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చిన్నారులపై దాడి చేయడానికి యత్నించిన ఘటనలు కూడా చోటుచేసుకున్నట్లు సమాచారం.కోతులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పంపించాలని, ప్రజల భద్రత కోసం తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. అడవుల తగ్గుదల, ఆహారం కొరత కారణంగా కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయని నిపుణులు చెబుతున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




## బి నెగెటివ్ రక్తం అందజేత

- **ఏఈఓ అశోక్ రెడ్డి సేవాభావం**

**కామారెడ్డి, మర్చి 03(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పట్టణానికి చెందిన జువ్వాడి భాగ్యమ్మ (48) కు ఆపరేషన్ నిమిత్తం బి నెగెటివ్ రక్తం అత్యవసరంగా అవసరమైంది. సమాచారం అందుకున్న వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అశోక్ రెడ్డి స్పందించి రక్తదానం చేసి మానవతా విలువలను చాటుకున్నారు. ఈ విషయాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త మరియు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు వెల్లడించారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, నెగెటివ్ గ్రూపుల రక్తం అత్యవసర సమయాల్లో సులభంగా దొరకడం కష్టమని తెలిపారు. ప్రతి సంవత్సరం మూడు నుంచి నాలుగు సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న అశోక్ రెడ్డిని అభినందించారు."రక్తదాతలే ప్రాణదాతలు. సకాలంలో రక్తం అందకపోతే ప్రాణాపాయం తలెత్తే పరిస్థితులు ఉంటాయి. డబ్బులతో రక్తాన్ని కొనుగోలు చేయడం సాధ్యం కాదు. మానవతా దృక్పథంతో యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.





# దెగామ@సర్పంచ్ గూడలో సంప్రదాయ హోలీ వేడుక.

**బజార్ హత్నూర్, మార్చి 3(డిడి9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల పరిధిలోగలదేగాం@సర్పంచ్ గూడ గ్రామంలో ఆ గ్రామసర్పంచ్ దుర్వ దేవుబాయి సమక్షంలో మంగళవారం రోజు హోలీపండుగనుగ్రామస్తులు జరిపారు.గిరిజన ఆదివాసీ గోండి సంస్కృతి సంప్రదాయల మేళవింపుతో, పూర్వీకుల ఆచరిస్తూ వస్తున్న పద్ధతులు ఆచరించి చూపారు.మోదుగపవ్వు రంగులతో రంగుల హోలీపండుగను గ్రామస్తులందరు కలిసి ఘనంగా నిర్వహించారు. రంగులు ఒకరి పై ఒకరు చల్లుకొని ఆట పాటలతో, సంప్రదాయ నృత్యం చేసి అనందంగా గడిపారు.





# గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు నేపథ్యంలో టీజీ డబ్ల్యూ డబ్ల్యూ సి–ఒమాన్ శాఖ అత్యవసర సమావేశం

**బజార్ హత్నూర్, మార్చి 3(డిడి9న్యూస్ ):-**

ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఇరాన్ దాడుల పరిణామాలతో ఇక్కడ పనిచేస్తున్న తెలంగాణ కార్మికులు మరియు వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి (టీజీడబ్ల్యూడబ్ల్యూసి) ఒమాన్ శాఖ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొంతమంది కార్మికులు తెలియక ప్రస్తుత పరిస్థితులను వీడియోల రూపంలో చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడం గల్ఫ్ దేశాల కఠిన చట్టాల ప్రకారం తీవ్రమైన సమస్యలకు దారితీస్తుందని అన్నారు. అలాంటి చర్యలు వ్యక్తిగత భద్రతకే కాకుండా ఇతర కార్మికుల భద్రతకూ ముప్పు కలిగించే అవకాశముందని పేర్కొన్నారు. కార్మికులంతా ఆయా దేశాల ప్రభుత్వాలు విడుదల చేస్తున్న అధికారిక గైడ్‌లైన్స్‌ను మాత్రమే అనుసరించాలని, అనవసర ప్రయాణాలు పూర్తిగా నివారించాలని, స్థానిక అధికారుల సూచనలు తప్పని సరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విదేశాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ కుటుంబ సభ్యులతో ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా మాట్లాడి తమ క్షేమ సమాచారాన్ని తెలియజేయాలని కోరారు. ఇంటికాడ కుటుంబ సభ్యులు సమాచారం లేకపోతే మరింత ఆందోళనకు గురవుతారని, అందువల్ల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండేలా మనం నిరంతరం సమాచారం అందించడం ప్రతి కార్మికుడి బాధ్యత అని స్పష్టం చేశారు. సెలవులపై స్వదేశానికి వెళ్లే కార్మికులు ఫ్లైట్ రద్దు కావడం వల్ల టికెట్ల విషయంలో కొంత ఆందోళన ఉన్నప్పటికీ ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు ఎయిర్ లైన్స్ విమానాల పునరుద్ధరణ ప్రకటన వచ్చినంక మీ టికెట్స్ రీ షెడ్యూల్ విషయంలో ఎయిర్ లైన్స్ తో మాట్లాడి సహకరిస్తామని ఈ సందర్భంగా అన్నారు ఈ సందర్భంగా టీజీడబ్ల్యూడబ్ల్యూ సి రాష్ట్ర కార్యదర్శి పాలాజీ శ్రీనివాసు మాట్లాడుతూ, ఒమాన్ ప్రభుత్వం మరియు సంబంధిత అధికార యంత్రాంగం సోషల్ మీడియా వేదికల ద్వారా విడుదల చేసిన సూచనలు, గైడ్‌లైన్స్‌ను సమగ్రంగా సమీక్షించి, వాటిని ఒమాన్ శాఖ కోఆర్డినేటర్లు మరియు కార్మికులకు ఇప్పటికే తెలియజేసినట్లు తెలిపారు. ప్రతి కార్మికుడు ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ఒమాన్‌లోని తెలంగాణ కార్మికులు ఎటువంటి అత్యవసర పరిస్థితులు ఎదుర్కొన్నా టీజీడబ్ల్యూడబ్ల్యూసి ఒమాన్ శాఖ సభ్యులను వెంటనే సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు: +968 80071234 +968 98292270 కు సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చని సూచించారు. "మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందవద్దు… మీ వెంటే టీజీడబ్ల్యూడబ్ల్యూసి ఉంది. ప్రతి కార్మికుడి భద్రత, వారి కుటుంబాల విశ్వాసం మా బాధ్యత" అని నాయకులు భావోద్వేగభరితంగా భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో టీజీడబ్ల్యూడబ్ల్యూసి రాష్ట్ర కార్యదర్శి పాలాజీ శ్రీనివాసు, ఒమాన్ శాఖ అధ్యక్షులు జావుడాల సత్తన్న, మస్కట్ కోఆర్డినేటర్లు గోగు దేవరాజు తదితర కోఆర్డినేటర్లు మరియు పలువురు కార్మికులు పాల్గొన్నారు.




# సాలూర మంజీరాలో విషాదం.. స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు మృతి

**నిజామాబాద్ జిల్లా, 03 మార్చి(డీడీ9 వార్త) :**

హోలీ పండుగ వేళ సాలూర సమీపంలోని మంజీర నది తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. రంగుల పండుగ ముగిసిన తర్వాత సరదాగా స్నానానికి వెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బోధన్ పట్టణం ఆచన్‌పల్లి కాలనీలో తీవ్ర శోకాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆచన్‌పల్లి కాలనీకి చెందిన సుమారు 10 మంది యువకులు మంగళవారం హోలీ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం స్నానాలు చేసేందుకు సాలూర శివారులోని మంజీరా నదికి వెళ్లారు. నదిలో దిగిన క్రమంలో రోని చౌదరి(18), సాయికుమార్(20) అనే ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యారు. గాలింపు చర్యల తర్వాత వారిద్దరూ విగతజీవులుగా తేలారు. ఒకరు ఇంజనీరింగ్ విద్యార్థి..





మరొకరు దుబాయ్ నుంచి వచ్చి.. మృతుల్లో రోని చౌదరి హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, సాయికుమార్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి ఇటీవలనే స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఉన్నత చదువులు చదువుతూ, విదేశాల్లో ఉపాధి పొంది కుటుంబానికి ఆసరాగా ఉంటారనుకున్న యువకులు పండుగ రోజే విగతజీవులుగా మారడంతో ఆ కుటుంబాల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. పండుగ పూట చేతికి వచ్చిన కుమారులు మృతి చెందడంతో మృతుల తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వారి రోదనలు స్థానికులను కలచివేశాయి. ఈ విషాదంతో ఆచన్‌పల్లి కాలనీలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.

# అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా గుట్టురట్టు

- **34 కేసుల్లో 10 మంది నిందితుల అరెస్ట్..**
- **క్వింటాన్నర రాగి తీగలు, నగదు స్వాధీనం**

**నిజామాబాద్ జిల్లా, 03 మార్చి(డీడీ9 వార్త) :**




నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో గత కొంతకాలంగా ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగలను దొంగిలిస్తూ విద్యుత్ శాఖకు, రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును నిజామాబాద్ పోలీసులు రట్టు చేశారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ పి.సాయి చైతన్య నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ భారీ దొంగతనాలకు సంబంధించి మొత్తం 10 మందిని గుర్తించగా, అందులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన ముగ్గురు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన అఫ్జల్ ఖాన్, భైంసాకు చెందిన అర్బాజ్ ఖాన్, రెంజల్‌కు చెందిన సిద్దిక్ ఖాన్‌లతో పాటు మరికొందరు పాత నేరస్తులు జైలులో పరిచయమై ఒక ముఠాగా ఏర్పడ్డారు. గతంలో ఆవుల దొంగతనం, బైక్ చోరీ కేసుల్లో జైలుకు వెళ్లిన వీరు, అక్కడ కలిసిన అన్సార్, తాహెర్‌లతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ కాయిల్స్ దొంగిలించాలని పథకం వేశారు. ప్రధానంగా గోదావరి నది పరివాహక ప్రాంతాలైన నవీపేట, నందిపేట, బోధన్, బాసర, ముధోల్, భైంసా మండలాల్లోని నిర్మానుష్య ప్రాంతాలను వీరు లక్ష్యంగా చేసుకున్నారు. పగలు బైక్‌లపై తిరుగుతూ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, రాత్రి సమయంలో ఆటోలో వచ్చి అత్యంత చాకచక్యంగా రాగి తీగలను దొంగిలించేవారు. దొంగిలించిన రాగిని నిజామాబాద్‌లోని ఏపీ హెచ్‌బీ కాలనీలో ఒక గదిని అద్దెకు తీసుకుని అక్కడ భద్రపరిచేవారు. అనంతరం భైంసాకు చెందిన మహెబూబ్ ఖాన్ అనే ప్రధాన రిసీవర్‌కు కిలో రూ. 800 చొప్పున విక్రయించి, వచ్చిన సొమ్ముతో నిందితులు జల్సాలు చేసేవారు. పోలీసులు తమ సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను వలపన్ని పట్టుకున్నారు. వీరి నుంచి సుమారు 1.20 క్వింటాళ్ల రాగి తీగలు, రూ. 2.75 లక్షల నగదు, ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు మరియు దొంగతనానికి ఉపయోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా అరెస్టుతో రెండు జిల్లాల్లోని 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 34 కేసులకు పరిష్కారం లభించిందని సీపీ తెలిపారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన ఏసీపీ ప్రకాష్ యాదవ్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్ మరియు సిబ్బందిని కమీషనర్ ప్రత్యేకంగా అభినందించారు.





# భారత రాజ్యాంగం పాఠ్యాంశంలో చేర్చాలి...

- **జై భీమ్ మహాసేన ఆధ్వర్యంలో రథయాత్ర....**
- **జిల్లా కేంద్రానికి చేరుకున్న రథయాత్ర...**

**మెదక్ (డీడీ9 వార్త) ప్రతినిధి**

దేశానికి స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కానున్న భారత రాజ్యాంగం అమలై 77 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత రాజ్యాంగాన్ని ప్రజలందరూ చేరువయేలా భారత రాజ్యాంగాన్ని పార్టీ విషయంలో చేర్చాలని జై భీమ్ మహాసేన మన హక్కుల పరిరక్షణ సంఘం విశ్వజన కళామండలి విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్ర మంగళవారం మెదక్ జిల్లా కేంద్రానికి చేరుకుంది ఈ సందర్భంగా మెదక్ 27వ వార్డులో గల భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా జై భీమ్ మహాసేన.విశ్వ కళా మండలి. జాతీయ అధ్యక్షులు మాస్టర్ జీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం లిఖితపూర్వక రాజ్యాంగమని ప్రపంచ దేశంలో అతిపెద్దదైన భారత రాజ్యాంగాన్ని భారతరత్న విశ్వ మహానీయుడు మహా మేధావి బాబాసాహెబ్ డాక్టర్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ రెండు సంవత్సరాల 11 నెల 18 రోజులపాటు కష్టపడి రచన చేయడం జరిగిందని. 1949 నవంబర్ 26వ తేదీన సంపూర్ణగా భారత రాజ్యాంగాన్ని పార్లమెంటులో అమలు చేయడం జరిగిందని. ఈ రాజ్యాంగం 1950 జనవరి 26న భారత పార్లమెంట్ ఆమోదం తెలిపిందని నాటి నుంచి నేటి వరకు దేశ ప్రజలకు సార్వసత్తా సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా నిర్ధారించబడిందని దేశ ప్రజలందరికీ సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని సమానంగా చేస్తూ భారత రాజ్యాంగం హక్కును కల్పించిందని భారత ప్రజల పైన మేము మాకు మేము గా రాసుకున్న భారత శాసనగ్రంథం భారత రాజ్యాంగం అని ప్రజలందరూ ప్రకటించుకునే నాటి నుంచి నేటి వరకు భారత రాజ్యాంగాన్ని కేవలం రాజకీయ నాయకులు ప్రమాణస్వీకారం చేయడానికి పనికి వచ్చిందని ప్రజలకు చేరువయేలా ఎక్కడ అమలు కాకుండా పోయిందని ఆయన అన్నారు ఇప్పటికైనా భారత రాజ్యాంగాన్ని ప్రజలకు అందేలా సంపూర్ణంగా ప్రజలకు అర్థమయ్యేలా రీతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టుగా పాఠంశాలలో చేర్చాలని దీనికోసం ప్రతి జిల్లాలో రథయాత్ర ద్వారా ప్రచారం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు ఇప్పటివరకు మేడ్చల్ సంగారెడ్డి మెదక్ జిల్లాలో ప్రచారం చేయడం జరిగిందని ప్రజలందరికీ సహకారంతో ప్రతి సమావేశాన్ని విజయవంతం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పటికే కేరళ రాష్ట్రంలో ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు పాఠంశాలలో రాజ్యాంగాన్ని చేర్చడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. పాఠశాలలో ప్రతిరోజు 45 నిమిషాల పాటు భారత రాజ్యాంగాన్ని పిల్లలకు బోధించాలని ప్రతి పరీక్షలలో భారత రాజ్యాంగ జ్ఞానికి సంబంధించిన ప్రశ్న పత్రం ఉండాలని ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఇప్పటివరకు భారత రాజ్యాంగాన్ని పాఠశాలల చేర్చాలని కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒకవేళ భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలలో చేరకపోతే ఏప్రిల్ 14 నుండి అన్ని ప్రజాసంఘాల మద్దతుతో అమర నిరాహారదీక్షమని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర జై భీమ్ మహాసేన నాయకులు రాజ్యాంగం అంజన్న.అశోక్. రాణి. యాదమ్మ . మెదక్ పట్టణ నాయకులు క్రాంతి మొగులయ్య. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్. సిపిఎం నాయకుడు మల్లేశం. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు భీమసేన. విశ్వజనా కళామండలి కళాకారులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు...



## కాల్వపల్లి ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారుల

# దౌర్జన్యాలు తక్షణమే ఆపాలి

- **బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**

**ములుగు,మార్చి3(డీడీ9 వార్త):**

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో కాల్వపల్లి గ్రామంలో తరతరాలుగా పోడు భూములను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలపై అటవీ శాఖ అధికారులు సాగిస్తున్న అరాచకాలను బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ కాల్వపల్లి ఆదివాసీల జోలికి రావద్దని అన్నారు కాల్వపల్లి గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లోకి అటవీ శాఖ అధికారులు చొరబడి,వారిని భయభ్రాంతులకు గురి చేయడం అత్యంత దుర్మార్గం తక్షణమే ఈ దాడులు నిలిపివేయాలి, లేనిపక్షంలో బాధితుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది



మంత్రి సీతక్క ఇలాకాలో ఈ అన్యాయమా?: స్వయంగా గిరిజన బిడ్డగా,ఆదివాసీల కష్టాలు తెలిసిన మంత్రి సీతక్క సొంత జిల్లాలోనే, ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే అడవి బిడ్డలపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత బాధాకరం. గిరిజనుల ఓట్లతో గెలిచి, వారి హక్కులను కాపాడలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు

# మా పేర్లు వాడుకుని ఇల్లు గడుపుకుంటున్నారు..




సోషల్ మీడియాలో తనపై వచ్చే విమర్శలు, నెగెటివ్ కామెంట్స్ గురించి బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఘాటుగా స్పందించారు. ఇంటర్నెట్ లో ఎవరో ఏదో అనుకుంటున్నారని తాను అస్సలు బాధపడనని, అవన్నీ కేవలం వ్యూస్ కోసం చేసే పనులేనని ఆమె తేల్చి చెప్పారు. రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న జాన్వీ తనపై వస్తున్న నెగెటివ్ కామెంట్స్ పై.. అర్జున్ కపూర్ ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి కూడా ఆమె స్పందించి ట్రోలర్స్ కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. సోషల్ మీడియా గురించి జాన్వీ మాట్లాడుతూ.. ''ఇప్పుడు ప్రతి ఒక్కరికీ వ్యూస్, లైక్స్ కావాలి. అందుకే సెలబ్రిటీల పేర్లను వాడుకుని ఏదో ఒక కంటెంట్ క్రియేట్ చేస్తారు. మనల్ని కేవలం ఒక బలిపశువులా వాడుకుని వారి పేజీలకు క్లిక్స్ తెచ్చుకుంటారు. ఒకసారి మనకు ఈ విషయం అర్థమైతే.. వారు మన గురించి అనే మాటలను మనం అస్సలు పట్టించుకోం. అవి మన గురించి కాదు, వారి బిజినెస్ కోసం అని తెలిసిపోతుంది.

అందుకే నేను కూడా నాపై వచ్చే నెగెటివ్ కామెంట్స్ను పట్టించుకోను'' అని అన్నారు. అలాగే తన సోదరుడు అర్జున్ కపూర్ ఎదుర్కొనే బాడీ షేమింగ్, యాక్టింగ్ ట్రోల్స్ గురించి జాన్వీ ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా అర్జున్ పోస్ట్ ల కింద విపరీతమైన నెగెటివ్ కామెంట్స్ పై స్పందిస్తూ.. ''ప్రతి ఒక్కరూ తమ ఇల్లు గడవడానికి ఇలాంటి పనులు చేస్తున్నారు. ఇది చాలా చిన్న విషయం, దీని గురించి ఐదు నిమిషాల కంటే ఎక్కువ ఆలోచించడం అనవసరం. అయితే, అది వేధింపుల స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రం బాధ కలుగుతుంది. ముఖ్యంగా నా అన్న విషయంలో జరుగుతున్న దానికి ఎలాంటి సాకులు చెప్పలేం. నెగెటివిటీని వదిలేయడమే ఉత్తమం'' అని షాకింగ్ కామెంట్స్ చేశారు.

# నేనే అందరినీ ఏడిపిస్తా.. నాలో మరో కోణాన్ని చూస్తారు



'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' ఎంటర్‌టైనర్ అయినా కథలో ఓ ఆసక్తికర మలుపుతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయని అంటున్నారు లయ. శివాజీతో కలిసి ఆమె నటించిన చిత్రమిది. సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. ఈటీవీ విన్‌తో కలిసి నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా లయ పంచుకున్న ఆసక్తికర విశేషాలివే..!

**హీరోను డామినేట్ చేసే పాత్ర..**

''శివాజీగారితో కలిసి నటించి 20ఏళ్లు అవుతోంది. ఈ సినిమా గురించి అడగగానే ఫ్యామిలీ డ్రామా అనుకున్నాను. కానీ, ఓ ఎంటర్‌టైనర్. అన్ని వయసుల వారికి నచ్చుతుంది. ఇందులో ఓ ఆసక్తికర ట్విస్ట్ తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఇప్పటి వరకు నన్ను నేను ఇలాంటి పాత్రలో చూసుకోలేదు. మంగపతిలాంటి పవర్‌ఫుల్ పాత్ర చేసిన హీరోను డామినేట్ చేసే పాత్ర నాది. నేను, శివాజీ కలిసి నటించిన సన్నివేశాలు చక్కటి వినోదాన్ని పంచుతాయి. ఓటీటీ నుంచి థియేటర్‌లో విడుదలవడం ఎంతో ఆనందంగా ఉంది''

**అందరినీ ఏడిపిస్తా..**

''సినిమా అంటే శివాజీకి ప్యాషన్. సినిమాను అన్ని రకాలుగా ప్రేమిస్తుంటారు. ఇక దర్శకుడు సుధీర్ శ్రీరామ్ స్టోరీ ఎంత బాగా రాసుకున్నాడో. అంత క్లారిటీగా తీర్చిదిద్దాడు. ఏ పాత్రకు ఎంత నటన కావాలో అంతా మా నుంచి రాబట్టాడు. మంచి ప్రతిభ గల దర్శకుడు. లయ అంటే ఎమోషనల్ పాత్రలే చేస్తుందనే గుర్తింపు ఉండేది. కానీ, ఈ సినిమాలో అందరినీ ఏడిపిస్తా. తన భర్త, ఫ్యామిలీ గురించి ఆలోచించే స్వార్థపరురాలి పాత్ర''

**నాలో మరో కోణాన్ని చూస్తారు..**


''అన్నిసార్లు ప్రధాన పాత్రలు వస్తాయనుకోలేం. కానీ కథ, నా పాత్ర నచ్చితే చిన్నపాత్రలైనా చేస్తాను. కథను మలుపు తిప్పే శక్తిమంతమైన క్యారెక్టర్స్ చేయాలని ఉంది. నేను చూడటానికి సాఫ్ట్ గా ఉన్నా ఏదైనా చెప్పాలంటే బలంగా చెబుతా. 'వదల' అనే సినిమాలో జగపతిబాబుతో నటిస్తున్నాను. ఇందులో నాలో మరో కోణాన్ని చూస్తారు. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. డిఫరెంట్ జోనర్‌లో ప్రయత్నిస్తున్నాను. శ్రీకాంత్‌తో కూడా ఓ సినిమా చేస్తున్నాను. నాగేశ్వరరెడ్డి దర్శ

# 'పెద్ది' షూటింగ్ ఆపేద్దామన్నా చరణ్ వినలేదు..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సనా కాంబోలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, ఇటీవల విడుదలైన సెకండ్ సింగిల్ 'రై రై రారా' సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. తాజాగా ఈ పాటపై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసల జల్లు కురిపించగా, దానికి స్పందించిన దర్శకుడు బుచ్చిబాబు ఒక షాకింగ్ నిజాన్ని బయటపెట్టారు. చిరంజీవి, 'రై రై రారా' పాట అద్భుతంగా ఉందని కొనియాడారు. ''ఈ పాట శక్తి, భావోద్వేగం సినిమాటిక్ ప్రకాశానికి నిదర్శనం. చరణ్ కదులుతున్న తీరు, అతని ఎనర్జీ చూస్తుంటే తండ్రిగా నాకు ఎంతో గర్వంగా ఉంది'' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మ్యాజిక్, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, రత్నవేలు విజువల్స్, అనంత శ్రీరామ్ సాహిత్యంపై చిరు ప్రశంసలు కురిపించారు. నిర్మాత వెంకట సతీష్ కిలారును కూడా ఆయన అభినందించారు.

చిరంజీవి ట్వీట్‌కు ధన్యవాదాలు తెలుపుతూ బుచ్చిబాబు ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ''ఆ రోజు నాకు ఇంకా గుర్తుంది సార్.. ఈ సాంగ్ షూటింగ్ చేస్తున్నప్పుడు చరణ్ సార్‌కు తీవ్రమైన జ్వరం ఉంది. జ్వరం ఎక్కువగా ఉండటంతో షూటింగ్ ఆపేద్దామని మేము అన్నాము. కానీ చరణ్ సార్ మాత్రం లేదు చేద్దాం అని పట్టుబట్టారు. అంత జ్వరంలో కూడా ముఖంపై చిరునవ్వుతో, ఎంతో గ్రేస్‌తో ఆయన డ్యాన్స్ చేశారు. ఆ డెడికేషన్, క్రమశిక్షణ అన్నీ మీ నుంచి వచ్చినవే సార్'' అని బుచ్చిబాబు ఎమోషనల్ అయ్యారు. జ్వరాన్ని కూడా లెక్కచేయకుండా చరణ్ చూపించిన అంకితభావం ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'అదీ మెగా వారసుడి డెడికేషన్ అంటే' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఏప్రిల్ 30న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇందులో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరో





# మేము నటులం.. వస్తువులం కాదు..



'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి సప్తమి గౌడ, సినిమా వేడుకల్లో ఫొటోగ్రాఫర్లు, కెమెరామెన్ల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా నటులను అసభ్యకరమైన కోణాల్లో చిత్రీకరించడంపై ఆమె సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంచలన పోస్ట్ పెట్టారు. పబ్లిక్ ఈవెంట్లలో ఫీమేల్ యాక్టర్స్ కనిపిస్తే, వారి నటన లేదా పని కంటే వారి శరీర భాగాలపైనే కెమెరాలు జూమ్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ''మేము ఇక్కడ ఉన్నది మా కళ కోసం, సినిమా కోసం. కానీ కొంతమంది ఉద్దేశపూర్వకంగా అసభ్యకరమైన యాంగిల్స్ నుంచి ఫొటోలు తీస్తూ మమ్మల్ని కించపరుస్తున్నారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది ఒక వ్యక్తి గౌరవానికి సంబంధించిన విషయం. ఈవెంట్లను కవర్ చేసే వారు వృత్తి నైపుణ్యాన్ని, కనీస మర్యాదను పాటించాలి. ఇలాంటి పనులను మేము అస్సలు సహించము. ఈ విషయంలో మహిళా నటులమంతా ఐక్యంగా ఉన్నాము'' అని రాసుకొచ్చారు. ఈ అసభ్యకరమైన ధోరణిని ఇకపై సాధారణ విషయంగా చూడకూడదని ఆమె స్పష్టం చేశారు. తన పోస్ట్‌కు 'Actors Not Objects' (మేము నటులం.. వస్తువులం కాదు) అనే క్యాప్షన్‌ను జోడించడం గమనార్హం. మీడియా మిత్రులు, జర్నలిస్టులు కూడా తమకు మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. ప్రస్తుతం సప్తమి గౌడ్ పోస్ట్ సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. గతంలో కూడా జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, నోరా ఫతేహి వంటి స్టార్ హీరోయిన్లు ఈ 'జూమ్‌ఇన్' సంస్కృతిపై ఫిర్యాదు చేశారు. ఇప్పుడు సప్తమి గౌడ మరోసారి ఈ అంశాన్ని లేవనెత్తడంతో సోషల్ మీడియాలో దీనిపై పెద్ద చర్చ మొదలైంది. ఒక నటిగా తన ఆత్మగౌరవం కోసం ఆమె తీసుకున్న ఈ నిర్ణయానికి నెటిజన్ల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. అమ్మడు ధైర్యానికి ప్రశంసలు

# స్పోర్ట్స్ డ్రామాలో శ్రీలీల?



''నువ్వు నా వాడివి.. నువ్వే నా ప్రతి ఆనందానివి'' అంటూ ఇంకా పేరు ఖరారు కానీ ఓ సినిమాతో అలరించడానికి ముస్తాబవుతున్నారు బాలీవుడ్ కథానాయకుడు కార్తిక్ ఆర్యన్, శ్రీలీల. ఇంకా ఈ చిత్రం విడుదల కాకముందే.. ఈ జంట ఇప్పుడు మరో సినిమా కోసం జోడీ కట్టడానికి సిద్ధమైంది. 'చందు ఛాంపియన్' దర్శకుడు కబీర్ ఖాన్‌తో కార్తిక్ ఓ సినిమా కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం. ''స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో కార్తిక్ కిక్ బాక్సింగ్ కోచ్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన నటించడానికి శ్రీలీలతో చర్చలు చేస్తున్నారు. నిజ జీవితాధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలోని తన పాత్ర కోసం కార్తిక్ శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైన ఈ చిత్రం 2027లో థియేటర్లలోకి వచ్చే అవకాశముంద''ని శ్రీలీల సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి తన స్టెప్పులతో అదరగొట్టే ఈమె.. మరోసారి కార్తిక్‌తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

# పిల్లల కోసం యుద్ధానికైనా సిద్ధమే..



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల పెళ్లి వార్త ఇంకా సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తూనే ఉంది. ఉదయ్‌పూర్‌లో పెళ్లి ముగించుకుని హైదరాబాద్ వచ్చిన ఈ కొత్త జంట, ప్రస్తుతం వరుసగా టెంపుల్స్ విజిట్ చేస్తూ, స్వీట్లు పంచుతూ సందడి చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకుంటున్న ఈ క్రమంలో, రష్మిక తన పిల్లల గురించి చేసిన ఎమోషనల్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. రీసెంట్‌గా జరిగిన ఒక మూవీ ఈవెంట్‌లో రష్మిక తన ఫ్యూచర్ పిల్లల గురించి మాట్లాడుతూ చాలా ఎమోషనల్ అయ్యారు. ''నేను ఇంకా తల్లిని కాలేదు, కానీ నాకు పిల్లలు పుడతారని నాకు తెలుసు. ఆ క్షణం కోసం నేను ఎంతో ఇష్టంగా ఎదురుచూస్తున్నాను.

ఇంకా పుట్టని ఆ చిన్న ప్రాణాల మీద నాకు ఇప్పుడే చాలా స్ట్రాంగ్ ఫీలింగ్ ఉంది. వాళ్ల కోసం నేను ఏదైనా చేయాలనుకుంటున్నాను. వాళ్లను చాలా సురక్షితంగా, ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలని నాకు ఉంది. ఒకవేళ వాళ్ల కోసం నేను యుద్ధానికి వెళ్లాల్సి వస్తే.. ఆ యుద్ధం చేసేంత ఫిట్‌గా నేను ఉండాలి. నేను ఇప్పుడే దాని గురించి ఆలోచిస్తున్నాను'' అని రష్మిక చెప్పుకొచ్చారు. పెళ్లైన కొత్తలోనే రష్మిక ఇలా పిల్లల గురించి, వాళ్ల రక్షణ గురించి ఇంత ఇంటెన్సివ్‌గా మాట్లాడటం చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. రష్మికలోని మాతృత్వాన్ని, బాధ్యతను చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఒకవైపు విందు భోజనాలు, మరోవైపు సామాజిక సేవ చేస్తూనే.. తన పర్సనల్ లైఫ్ గురించి ఇలా ఓపెన్‌గా మాట్లాడటం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ రష్మికల ఈ కొత్త ప్రయాణం ఎంతో హ్యాపీగా సాగాలని అందరూ కోరుకుంటున్నారు.